
# దేవుడున్నాడు

ఆ బస్టాండులో బస్సాగింది. ఆ డీలక్స్ బస్సులోకి అతను ఎక్కాడు. ఏభై ఏళ్ళుంటాయి. ప్యాంటు షర్టు వేసుకున్నాడు.



- సికిందర్

గడ్డం పెరిగివుంది. కాళ్ళకి చెప్పుల్లేవు. నడక బలహీనంగా వుంది. అతను బస్సులోకి చూశాడు. జనం పలచగా వున్నారు. జేబులోంచి కార్డులు తీశాడు. అవి పంచుకుంటూ పోయాడు. బస్సుల్లో ఇలాటివి మామూలే. కొందరు వాటిని ఆసక్తిగా చదివారు. కొందరు పట్టించుకోలేదు. మధ్య వరసలో కూర్చున్న ఒక లావుపాటి ఖరీదైన మనిషి అసలు పట్టించుకోలేదు. పైపెచ్చు అసహ్యంతో విసిరికొట్టాడు. బిచ్చమెత్తుకుంటున్న మనిషి తలవంచుకుని వెనక్కి వెళ్ళిపోయాడు. పంచడం పూర్తిచేసి చెప్పడం ప్రారంభించాడు.

''అయ్యలార! అమ్మలార! మాది తూర్పుగోదావరి దినుసుకట్ట గ్రామమండి. తుఫానొచ్చి అంతా పోయిందండి. తినడానికి కూడు, కట్టడానికి బట్టలేవండి. బతికి చెడ్డామండి. పెళ్ళికెదిగిన కూతురుందండి. అమ్మలార అయ్యలార... ఆ కూతురు పెళ్ళికి బిచ్చమెత్తుకుంటున్నానండి. ధర్మప్రభువులు తమరు తలా ఓ రూపాయిస్తే తమ పేరు చెప్పుకుని పిల్ల ఓ ఇంటిదవుద్దండి. అమ్మలార అయ్యలారా...''

చెప్పడం పూర్తి చేసి తిరిగి కార్డులు తీసుకోసాగాడు. జనం తటపటాయించకుండా తలా ఓ రూపాయి తీసివ్వసాగారు. అలా ఇస్తున్నవాళ్ళనుద్దేశించి, ''ఈ బాబు ఒక రూపాయి యిచ్చేరండి. ఈ బాబుని బెజవాడ కనకదుర్గమ్మతల్లి సల్లగా చూస్తుందండి. భద్రాచలం రామయ్య తండ్రి వీరి పిల్లా పాపల్ని దీవిస్తాడండి. అందరికీ దేవుడున్నాడు. కష్టాలు తప్పక తీరుస్తాడు'' అంటున్నాడతను.

ఆ ఖరీదైన మనిషి వేళ్ళకున్న ఉంగరాలు

తిప్పుకుంటూ కూర్చున్నాడు. పై గుండీలు తీసిన సిల్కు చొక్కా అతడి బలమైన ఛాతిని బయల్పరుస్తోంది. ఆ ఛాతీ మీద తళుక్కు మంటూ గొలుసూ...

బిచ్చమెత్తుకుంటున్న మనిషి ఆ పక్కకొచ్చి చెయి జాపాడు. పెపరు చదువు కుంటూన్న మనిషి విసుగ్గా రూపాయి బిళ్ళ తీసి విసిరాడు. అదా మనిషి చేతిలో పళ్ళేదు. పక్క సీట్లో వున్న ఖరీదైన మనిషి కాళ్ళ మధ్య పడింది. వంగి దాన్ని తీసుకోబోయాడు బిచ్చమెత్తుకుంటున్న మనిషి. ఖరీదైన మనిషికి ఎక్కడలేని అసహ్యమూ కోపమూ వచ్చాయి. ''ఎవడ్రానువ్వూ? నన్ను ముట్టు కుంటున్నావు? పద, ఫో ఇక్కడ్నించి!'' అని కాలితో ఒక్క తోపు తోశాడు బలంగా. ''అమ్మా!'' ఆ మనిషి వెళ్ళి వెనక కడ్డీకి తలకొట్టుకుని బాధగా అర్చాడు. రూపాయి బిళ్ళలు కిందపడిపోయాయి. కింద కూర్చుని రెండు చేతుల్తో తలపట్టుకున్నాడు. ఏమైందో ఏమో వెంటనే తలవాల్చేశాడు.

గాభరా పడ్డారంతా. ఆ మనిషి కదిపి చూశారు. కళ్ళు తెరవలేదు. స్పృహ తప్పి పోయాడు. గోలగోలగా మాట్లాడుకోసా గారు. ఖరీదైన మనిషి బింకంగా కూర్చు న్నాడు. మగవాళ్ళు ఏమీ అన్లేకపోయారు గానీ, ఆడవాళ్ళు తలా ఓ మాటన్నారు. కండక్టరు, డ్రైవరూ వచ్చారు. సంగతి తెలుసుకుని ఆ ఖరీదైన మనిషిని అదోలా చూశారు. అతను రాయిలా కూర్చునే వున్నాడు. ఎవరో వాటర్ బాటిల్ తెచ్చి బిచ్చమెత్తుకుంటున్న మనిషి మొహంపైన నీళ్ళు చల్లారు. కదలిక వచ్చింది. కళ్ళు తెర్చి లేచి కూర్చున్నాడు. అయోమయంగా చూశాడు. ఇంకెవరో కిందపడ్డ నాణేలు ఏరి అతడి చేతిలో పోశారు. తీసుకోలేదతను. ఆ ఖరీదైన మనిషికేసి తీక్షణంగా చూశాడు. ఆర్థిక విలువలు వెల వెలా బోతున్నాయా చూపుల్లో. ముందుకు జరిగి, ఆ ఖరీదైన మనిషి కాళ్ళ మధ్య తనకు మాత్రమే సర్వ హక్కులూ వున్న రూపాయినాణేన్ని తీసుకోబోయాడు. ఆ చెయ్యి పట్టుకున్నాడు ఖరీదైన మనిషి.

ఆశ్చర్యపోయాడు బిచ్చమెత్తుకుంటున్న మనిషి.


ఏమిటది బాబయ్యా? అన్నాడు, ఉంగరాలూ గొలుసూ చూసుకుంటూ.

తలవంచుకుని బస్సుదిగి, కేంటీన్ వైపు వెళ్ళిపోతున్న ఖరీదైన మనిషికేసే చూస్తూండి పోయారంతా.

## కొత్త పుస్తకం

# శిథిల స్వరాలు

## (వచన కవితాసంపుటి)




**కవి: ఉండవిల్లి మల్లిఖార్జునరావు,**
**50 పేజీలు వెల: రూ. 12**
**ప్రతులకు: W. మల్లిఖార్జునరావు,**
**F-1, గౌతమీ ఎపార్ట్‌మెంట్స్, బోట్ క్లబ్ ఎదురుగా, కాకినాడ.**
**మరియు**
**గారపాటి తమ్మయ్య, డోర్ నెం. 39-3-1, మురళీనగర్, వైజాగ్.**

నేడు అభ్యుదయ కవిత్వానికి అక్షర నీరాజనాలు ఎందరో కవులు అర్పిస్తున్నారు. అటువంటి వారిలో ఉండవిల్లి కవి ఒకరు. వీరిని ముగ్గురు కవికుల గురువులు ఆశీస్సులిచ్చి దీవిస్తే, మరో ముగ్గురు కవితా శ్రేయోభిలాషులు మనసారా అభినందించారు. కవికి ఈనాడు సామాజిక స్పృహ ఒక్కటే వుంటే సరిపోదు. ప్రతిభ, వ్యుత్పత్తి వాటికి తోడు పరిశీలన, అవగాహన కూడా అబ్బాలి. కవితాను దర్శిం చిన అంశాల్ని కవితాత్మకంగా అక్షర బద్ధం చెయ్యగలిగినప్పుడే అది నలుగుర్లోకి వెళుతుంది. అది బాగుంటే కవి ఎత్తుకు ఎదగ గలుగుతాడు.

కవిత్వానికి, కాకినాడకి 'తల్లికోడి' వంటి అద్దేపల్లి రామమోహనరావుగారు ఈ చిరం జీవిని ఆశీర్వదించారంటే తప్పకుండా ఇతడు అభివృద్ధిలోకి రాగలడు. ఆయనది కవితా మృత హస్తం గనుక, 'శిథిల స్వరాలు' సంపుటి లో మొత్తం 36 కవితలు చోటు చేసుకున్నాయి. అయితే 'శిథిల స్వరాలు' అనే శీర్షికగల కవిత లేదు. అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని రచయిత ప్రత్యేకత కోసం ఈ పేరు పెట్టి ఉండి ఉంటారు. ఇదీ మంచి ప్రయత్నమే.

మల్లిఖార్జునరావు కాలానుగుణమైన కవిత్వ పోకడలను అకళించుకున్న వ్యక్తి. ఎందుకంటే అతని కొన్ని కవితల్లోనే నేడు రాకెట్‌లా దూసుకు వస్తున్న స్త్రీ వాదచ్ఛాయ లుండటమే 'చిరిగిన చీరల్లోంచి కుట్లూడిన జాకెట్లోంచి...

వాళ్ళు అనహాయంగా రోదిస్తారు.
ఆనవాళ్లుగా మిగిలిపోతాయి.
రోమియో'

ఇంకా ఇటువంటివే 'నేస్తం నా వెంట పడకు, స్త్రీ బాధితుడు, నలిగిన పువ్వు' వీటిల్లో కూడా స్త్రీకి నేటి సమాజంలో జరుగుతున్న పరాభవాలకు తగ్గట్టు ఆక్రందన, ఆవేదన అంత ర్లీనంగా కనిపిస్తున్నా వాళ్లూ మనలాంటి వాళ్లే నన్న ఉపదేశం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

'యవ్వనజ్యోతి' కవితలో కవి కోరికల్ని ఇలా వర్ణిస్తాడు.

'బ్రహ్మచారి వృక్షంపై
కోరికల గబ్బిలాలు వ్రేలాడుతుంటాయి.
మనను రగిలిపోతూ ఉంటుంది' అని ఈ కవితలో చక్కని భావ చిత్రణ చోటు చేసు కుంది. ఇదే విధంగా క్షరం లేని అక్షరం అక్షరాలు... అక్షరాస్త్రం అనే శీర్షికలతో వెలువడ్డ కవితలు అక్షర లక్షలుగా దర్శనమిస్తాయి.

'లోకం పోకడ' కవితలో అంద చందా లున్న స్త్రీమూర్తికి రాగల ఇబ్బందులు పేర్కొన్న తీరు ప్రశంసార్హం.

ఆశాజనకంగా ఉన్న కవితగా 'ఆశ' కనిపిస్తుంది. ఇందులో 'నిరాశలో కూడా ఆశలకి ప్రాణం పోసుకోవాలి. ఆశతో జీవిత జ్యోతిని వెలిగించుకోవాలి' అన్న సందేశాన్నిస్తారు.

ఇది ఉండవిల్లి మల్లిఖార్జునరావు చేసిన తొలి కవితా సంపుటి ప్రయత్నం కనుక శైశవం లో తప్పటడుగులు వేసి ఉన్నా, రాను రాను ఈ కవిత జాతీయ, అంతర్జాతీయ సమస్యల్ని కూడా అర్థం చేసుకుంటూ పురోగమించాలని కోరుకుందాం. 'వటుడింతై...' అన్నట్లుగా ఈ చిరంజీవి దిన దిన ప్రవర్ధమానమై ముందు ముందు మంచి కవితా సంపుటాలు ఎన్నో తేవాలని ఆశిద్దాం!

\- డా. మంతెన.